హస్తసాముద్రికం

పంతుల శ్రీరామశాస్త్రి

మే నెల మొదటివారం. ఉదయం పది గంటల వేళ. మద్రాసునుంచి కలకత్తా పోయే మెయిలు రాజమండ్రీ స్టేషనులో ఆగింది.

మామూలు తినుబండారాల అమ్మకం మనుషుల కలకలంతోడు "ఆఁ ఇంకెవరి కన్నా పుస్తకాలు కావాలండీ, నవల్సు, నాటకాలు, సినీమాపాటలు, హరికథలు, ఆడవాళ్ల పాటలు, బాలయోగిపాటలు..." అని ఆ వెనుక సుమారు ఒక పాటలాగ ఏర్పరచుకొన్న నవలల పేర్లు ఏకరువుపెట్టే పుస్తక విక్రేతల గొడవ రేగిన తేనెపట్టును తలపింపజేస్తుంది.

స్టేషనుకి ఇంకా కొంచెం దూరంలో ఉండి, మాటిమాటికీ టైము చూసుకొంటూ, లాగే రిక్షామనుషులను, తోసే జట్కా ఆసాములను తొందర చేసేవాళ్లకు మరొక్క అయిదు నిమిషాలు మెయిలాగితే, ఇవాళ ఒక్కనాడు ఆగితే చాలును, రేపు పదినిమిషాలు ముందుగా బయలుదేరిపోయినా బాధలేదన్నట్టుంది.

కాని, రైల్లో ఉన్నవాళ్ల ధోరణి వేరు. వాళ్లకి ప్రతి స్టేషనులోనూ ఆగవలసినకంటె చాలా ఎక్కువసేపు ఆగిపోయినట్టనిపిస్తుంది. అందులోనూ దూరప్రయాణికులకు మరీని. వాళ్ళలోనూ ఫస్టుక్లాసు, ఇంటరుక్లాసు ప్రయాణికులకు తాము విశాలంగా కూర్చుందికి తగిన స్థలం దొరికితే, మరికొంతమంది ఎక్కినా దిగినా అంత మరీ బాధగా ఉండదు. (అవి ఇంకా ఇంటరుక్లాసు ఉండే రోజులు లెండి.) అయితే వీళ్ళకి లేని బాధ ఇంకొకటి సెకండుక్లాసు వాళ్ళకి ఉంటుంది. అదేమిటంటే, తామెక్కిన బండీ ఏమో తమ స్వంతంలాగ, అందులో న్యాయంగా మరి ఇద్దరు ముగ్గురికి స్థానం ఉన్నా ఇంకొకరెక్కారంటే తమ హక్కు పగంపోయినట్టుగా తమ ప్రయాణంలోని సౌఖ్యంయావత్తూ అంతరించిపోయినట్టుగా భావించుకొంటారు.

రాత్రి మద్రాసులో బయలుదేరిన దగ్గర నుండీ కామేశ్వరరావుకి అలాగే వుంది. తానూ లీలా స్వేచ్ఛగా మాట్లాడుకొందికే వీలుచిక్కలేదు ఉదయం విజయవాడలో బండి ఆగేవరకున్నూ! అక్కడ తమతో అంతవరకూ వచ్చిన లాంకోటు, టోపీ ఆయనా, ఖద్దరు చొక్కా ధోవతీ ఆయనా ఇద్దరూ దిగిపోయారు. ఇకనైనా ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ప్రయాణం చెయ్యవచ్చుననుకొంటే తీరా బండి కదిలే వేళకు వచ్చి పడ్డాడొక సూటు బూటు ధరించిన యువకుడు, వేషం చూస్తే ఏదో మందు కంపెనీ ఏజంటు లాగుంది. అతను తమతో కూడా వచ్చి గోదావరిలో దిగిపోయాడు. అదృష్టవశాత్తు గోదావరిలో తమ పెట్టెలో ఎవ్వరూ ఎక్కలేదు. కాని, ఇకముందు ఎక్కరని నమ్మకం ఏమిటి?

"ఈ స్టేషనులోగాని, ఎవరైనా మన బండిలో ఎక్కితే, వచ్చే స్టేషనులో దిగి, ఫస్టుక్లాసులోకి టిక్కట్లు మార్పించేస్తాను."

లీల అంది — "ఎవళ్లెక్కితే మనకేమి? మన జాగా వాళ్ళేం తీసుకోలేరు కదా! ఎందుకు ఫస్టుక్లాసు ఇంకా దండుక్క, నాకిలాగే బాగుంది, అయినా చూడు, అమ్మే వాళ్ళగోల తగ్గిపోయింది. బండి బయలుదేరే వేళయినట్టుంది. మరింకెవరూ ఎక్కరేమోలే. ఎందుకలా ద్వారందగ్గర మొహం పెట్టుకొని నిలబడకావు? లోపలికివచ్చి కూర్చోకూడదూ? బండిలో ఎక్కదలచుకొన్నవాళ్లు నువ్వు అడ్డం నిలబడ్డా ఎక్కడం మానరు."

సరిగా ఆమె అన్నట్టే జరిగింది.

ఇంజను కూసింది. గార్డు విజిలు వేశాడు జెండా ఊపాడు. ఇంజను ఈమారు నిజంగా అన్నట్టు కూసింది.

అంతసేపూ ప్లాటుఫారంమీద పనీ పాటు లేనివాడిలా అటునించిటూ ఇటునించటూ, తిరుగుతూ ఉండిన సన్యాసిరాజుగారు తను పెట్టి పక్కనున్న గజం పట్టుకొని వేళ్ళాడుతూ "అబ్బాయి! తలుపు తియ్యి నాయనా మరి నాకీ ప్రయాణం తప్పేట్టు లేదు - ఆ వెధవ రాహువు ఉన్నాడే నన్నిలా తిప్పి చంపుతున్నాడన్నాడు."

ఆయన మాటలు సగం సాగుతూ ఉండగానే కామేశ్వర్రావు, "ఇది సెకండు క్లాసండీ, పరుపులబండి."

అతను "తెలుసును బాబూ! అందుకే యాభైరూపాయలు పోసి టిక్కట్టు కొన్నాను." అంటూ తలుపు తెరచుకొని లోపల ప్రవేశించి, ఖాళీగా ఉన్న బెర్తు మీద కూలబడి వగర్చుకొంటూ, "వెధవ డబ్బు, పోతేపోయింది, ఈ ప్రయాణం తప్పుతుందేమో అంటే తప్పింది కాదు. ఎలా తప్పుతుందీ, ఆ రాహువుగాడు శనిగాడితో కలిసి నన్నిలా ఆడిస్తూ ఉంటేను. రోజూ సరిగా వేళకిపోయే ఈ ముండా మెయిలు ఇవాళ పదినిముషాలు లేటుకూడా. ఇవాళ సరిగా వేళకి పోయివుంటే, నాకీ ప్రయాణం తప్పిపోయి ఉండును. ఎలా తప్పుతుంది నాయనా, అంతా గ్రహచారం! ఈ ప్రయాణం ఇవాళ ఇలా జరగాలని రాసివుంది."

కామేశ్వరరావుకి ఈ ధోరణి చికాగ్గా ఉంది.

"అంతగా ప్రయాణం తప్పిపోవాలంటే, రైలెక్కడం మానీలేకపోయారూ? చేసే పనులు చేస్తూ ఉండడం, గ్రహచారం అనుకొంటూ ఉండడమూను."

"రైలెక్కకపోడమూ? నేనూ ఎక్కకుండా ఉండాలనే అనుకొన్నాను. అందుకోసమే, మద్రాసు, నెల్లూరు రెండు టెలిగ్రాములిచ్చాను, మా కుర్రవాళ్లిద్దరికీని. వాళ్ళలో ఏ ఒక్కడు ఈ బండిలో వచ్చి ఉండినా నేను హాయిగా ఇంటికివెళ్ళి పడుక్కొనిఉందును నీపాటికి. కావలసినవాళ్ళింట్లో పెళ్ళి. కుటుంబంలో ఎవళ్ళో ఒకళ్లు వెళ్లితీరాలి - ఇద్దరు కుర్రాళ్ళలోనూ ఒకడైనా రాకపోడం గ్రహచారం కాక మరేమిటి?"

"గ్రహచారమే బాబూ! గ్రహచారమే"

"నాయనా! నువ్వు స్పష్టంగా అనకపోయినా నాకు నీ ఉద్దేశం తెలుసును — హాయిగా చిలకా గోరింకల్లా ప్రయాణం చేస్తున్న మీ యిద్దరికీ మధ్యను నావంటివాడొకడు వచ్చి పడడం మీ గ్రహచారమని."

అక్కడితో లీల ఊరుకోలేకపోయింది.

"అదేమీ లేదు బాబుగారూ! ఈ బండేం మా స్వంతం కాదు. మేము తీసుకొనిపోయేది లేదు. మీరూ మాలాగే టిక్కట్టు కొను

కొన్ని వస్తున్నారు. మీకు లేని హక్కు మాకేముంది?"

ఆమె ఇలా కలుగజేసుకొని పరాయి మనిషితో మాట్లాడ్డం కామేశ్వరరావుకి ఏమీ నచ్చలేదు - అయితే, అంతమాత్రంలో ఆమెను మందలించడానికి కూడా సావకాశం లేదు - అద్దంముందు బల్లమీద ఉంచిన గోల్డుఫ్లేకు సిగరెట్టుడబ్బా తీసుకొని, బెర్తుమీద కిటికీవంక తిరిగి కూర్చొని, సిగరెట్టొకటి తీసి, అగ్గిపుల్ల వెలిగించాడు, ఆరిపోయింది. ఆమాత్రం గాలిలో ఆరిపోకుండా అగ్గిపుల్ల వెలిగించడం అతనికి చేతకాక కాదు; కోపంలో తొందరగా వెలిగించడం మూలాన ఆరిపోయింది. ఈమారు కొంచెం నెమ్మదిగా ముందుకు వంగి జాగ్రత్తగా సిగరెట్టు ముట్టించుకొని, బలంగా ఒక్కమారు పొగపీల్చి, మళ్ళీ కిటికీవంక తిరిగాడు, మీ ఖర్మం, మీ యిష్టంవచ్చినట్టు మాట్లాడుకొండి, నాకేం బాధ" అన్నట్టుగా.

అంతసేపూ చేతిలో పట్టుకొనిఉన్న పెద్ద కాన్వాసు సంచీని బెర్తుమీద తన పక్కగాఉంచి, పైమీది ఉత్తరీయంతో మరొకమారు మొగం తుడుచుకొని, దానిని తీసి, సంచిమీద ఉంచి కొంచెం విశ్రాంతిగా వెనక్కు చేరగిలబడి కూర్చున్నారు సన్యాసిరాజుగారు. తిలతండుల న్యాయంగా ఉన్న సుమారు పదిరోజుల పెరుగుదల కలిగిన గడ్డం, పెద్ద పొట్ట చెమటకు తడిసిన ముతకఖద్దరుచొక్కా, దవళరకం నేతపంచ, అతని వేషంలో థర్డుక్లాసు ప్రయాణికుడి లక్షణాల్ తప్ప సెకెండుక్లాసు ప్రయాణికుడి కళ ఎక్కడా గోచరించడంలేదు. పైమీది ఉత్తరీయం కొంచెం ఖరీదయినది కావడంకంటే అతను ధాటీగా "యాభైరూపాయలు పోసి టిక్కట్టు కొన్నాను" అని ఉండకపోతే కామేశ్వరరావు లోనికి రానిచ్చేవాడేకాదు.

సన్యాసిరాజుగారు కాస్త మర్యాదగా ముందుకువంగి "అమ్మాయి! నీకు నేను చుట్టకాల్చుకొంటే అభ్యంతరం ఉండదు కదూ? ఎంచేతంటే అబ్బాయి వరసమీద సిగరెట్టు కాల్చేరకంలాగుంది. ఆ పొగకి అలవాటుపడినవాళ్లకి ఇది అంత బాధ కలిగించదు" అంటూ సంచీలో వెతకనారంభించాడు.

ఆమె, "నాకేంబాధలేదు బాబుగారూ! మీయిష్టంవచ్చినన్ని చుట్టలుకాల్చుకొండి" అంది.

సన్యాసిరాజుగారు, చుట్టలున్నతోలు డొక్కు తీసి, అందులోనుండి, ఖరీదయిన దొరలు కాల్చేరకంచుట్టతీసి డొక్కు మళ్లీ సంచీలోఉంచి, వెనక్కు చేరగిలబడి, అన్నాడు.

"నాకు తెలుసునమ్మా నువ్వేం అభ్యంతరం చెప్పవని, ఇప్పుడు నాకీ ప్రయాణం తప్పకపోవడం ఎంత నిశ్చయమో, అలాగే ఇది అంత సుఖప్రదంగానూ, అనుకూలంగానూ జరిగితీరాలని రాసి పడేసిఉంది. ఉచ్ఛస్థుడైన శుక్రుడిప్రభావం ఊరికే పోతుందా?" అని అగ్గిపుల్ల వెలిగించి చుట్ట ముట్టించాడు.

లీల అంది—"బాబుగారికి జాతకాలూ గ్రహాలూఅంటే చాలా నమ్మకంలాగుంది?"

సన్యాసిరాజుగారు చుట్టపొగ గట్టిగా పీల్చి, కిటికీలోనుండి బైటికివదిలి, పెద్ద ఉపన్యాసానికి సిద్ధపడేట్టుగా గొంతు సర్దుకొని, "మంచి ప్రశ్న వేశావమ్మా - జాతకాలంటే, గ్రహబలం అంటే ఎవరికి నమ్మకం ఉండదు? అందరూ పైపైకి మాకేం నమ్మకంలేదని డబాయించేవారే. అందులోనూ చదువుకొన్నామనీ, నాగరికులమని అనుకొనేవారికి ఇదొక చాదస్తం."

"అయితే జాతకాలను నమ్మకపోవడమే చాదస్తం అంటారు?"

"నేననడంలో ఏముంది? ఎంతటినమ్మకంలేదనే వాళ్ళకయినా దొరలాగా, గుండెకి పట్టే పోయేట్టుగా ఒకటిరెండు ఫలితాలు ఋజువిచ్చేయంటే ఆ తరవాత వాళ్ళకే మాకంటే ఎక్కువనమ్మకం ఏర్పడిపోతుంది. మా తమ్ముడి క్లాసుమేటు ఒక ప్రాక్టీసులేని ప్లీడరుండేవాడు. ప్రాక్టీసు లేకపోయినా భుక్తికి లోటులేని పాటి ఉపాధి ఉండేది. అయినా అతనికి స్వంత ఆర్జనంటూ లేకపోడం ఎంతో కించగా ఉండేది. స్కూలు మాష్టరి ట్రెయినింగుకి వెళ్ళడమూ లేక ఏదయినా గుమాస్తాగిరీలో ప్రవేశించడమూ అనే స్థితికి వచ్చాడు. వాళ్లింట్లోవాళ్ళు కూడా అదే బాగుందన్నారు. నేను ఒక్కణ్ణే అడ్డుతగిలాను. "నాయనా! నువ్వేం విచారించకు. నీకు ముప్ఫైఅయిదవ ఏడు వచ్చేసరికల్లా మంచి అధికారం హోదాగల గవర్నమెంటు ఉద్యోగంలో ప్రవేశించి తీరుతావు" అన్నాను. అన్నట్టుగానే గవర్నమెంటువారి సెలక్షనులో నెగ్గి, సబ్‌కలెక్టరయి ఉన్నాడు. నేడో రేపో డిస్ట్రిక్టు కలక్టరు కూడా అవుతాడు. అయితే ఈ మాటలు చెప్పినప్పుడే నోటితో చెప్పడానికి మొగమటించి కాగితంమీద రాసి కవరులో పెట్టి సీలు చేసి ఉంచాను. గవర్నమెంటు ఉద్యోగం వచ్చిన మూడునెలల్లో భార్య పోయింది. ఆరుగురు చిన్నపిల్లలు—మళ్ళీ పెళ్లిచేసుకోలేడు, మానలేడు, తగిన సంరక్షణచేసే దిక్కులేక పిల్లలూ తనూ నానా అవస్థలూ పడుతున్నారు. ఇటీవల నేను సీలుచేసి ఉంచినకవరు విప్పి చూశాను. ఏముంది, "కళత్ర వియోగం, సంసార సౌఖ్యలోపం" అని ఉంది. అతనికిప్పుడు నిజమైన మనశ్శాంతి నిచ్చే అంశం ఏదైనా ఉంది అంటే అది జాతకాలనూ చేతులనూ పరిశీలించడమే. హస్తసాముద్రికంలో ఇప్పుడిప్పుడు అతనూ చాలా మంచి ఫలితాలనే చెప్పగలుగుతున్నాడని వింటున్నాను."

లీల కుతూహలం కొంచెం ఎక్కువయింది.

"అయితే బాబుగారు! తమరు కూడా చేతులు చూస్తారేమిటి? లేక వట్టి జాతకాలేనా?"

కామేశ్వరరావు సాగ్రహంగా ఒకమారు లీల వంకచూసి, మళ్ళీ కిటికీ వంకకి తిరిగి అయిపోతున్న సిగరెట్టుకి ఇంకొకటి అంటించాడు. అతడు చూసిన చూపును లీల కంటె సన్యాసిరాజే బాగా గుర్తించాడు కాని, అతని రంగు కళ్లద్దాల మొగంలో అటువంటి స్ఫురణఏమీ గోచరించలేదు.

కిటికీ వంక తిరిగి చుట్టగొయ్యి దులిపి, లీల నుద్దేశించి అన్నాడు. "భగవంతుడి దయవల్ల ఏదో పెద్ద లార్జించి పడేసిన ఆస్తికాస్త ఉంది. అయితే నిర్వ్యాపారంగా కూర్చొని తినడం కాపురుషలక్షణం కదా అని, ఈ జాతకాలూ సాముద్రికం, ఆయుర్వేదం ఇవన్నీ కృషిచేశాను. పెద్ద ఉద్యోగాలు చేసే వాళ్ళకయినా తీరిక ఉంటుంది గాని, నాకు రోజుకి కొద్ది గంటలయినా తీరిక ఉండదంటే నమ్మ-అయితే మొదట్లో జనం మరీ ఎక్కువ కావడంతో ఒక నియమం పెట్టేను. జాతకంగాని, చెయ్యిగాని చూపించుకోదలచుకొన్న వాళ్లు తలా ఒక రూపాయి చెల్లించాలి. ఆ డబ్బయినా నేను పేదవాళ్ళ కిచ్చే మందులకయే ఖర్చులకి ఉపయోగిస్తాను. దీనివల్ల కాలక్షేపానికి కాలక్షేపం, చేతిచమురు భాగవతం కాకపోడమునూ సిద్ధిస్తోంది."

లీల కుతూహలాన్ని అణచుకోలేకపోయింది.

"అయితే, బాబుగారూ! మీ మామూలు రూపాయి ఇచ్చుకొంటాం, మా చేతులు చూసి పెడతారా?"

"మామూలంటే ఇంటిదగ్గర తీర్థ ప్రజలాగ వచ్చిపడే జనాన్ని అరికట్టడానికిగాని మీవంటి వాళ్ళ మాటకాదు. ఇప్పుడు నేను ఇక్కడ మీ దగ్గర పుచ్చుకొన్నా అదికాస్తా డబ్బులో కలిసి ఖర్చయి పోకుండా ఉండాలి. నేను మా గురువు గారికి మాట ఇచ్చేను. ఈ విద్యమూలంగా డబ్బు ఆర్జించనని-సరే చేతులు చూడ్డానికేం తొందర? మీరూ చాలా దూరం ప్రయాణం చెయ్యవలసినట్టుంది."

"అవును బాబుగారూ! ఇది రేపు ఉదయం

★ హస్తసాముద్రికం ★

సుమారు ఈ రాత్రికిగాని కలకత్తా చేరదను కొంటాను.”

“సరిగా అంతే. అందులోనూ, దారిలో ఏ అవాంతరాలూ లేకుండా ప్రయాణం జరిగితేనే. అయితే యీవాళ మన ప్రయాణం చాలా సుఖంగా జరిగితీరాలి. నా గోచార ఫలితంరీత్యా! ఇటీవల రైలుప్రమాదాలు మరీ యెక్కువయిపోతున్నాయి; రైళ్ళెక్కడమంటేనే భయంగావుంది, యెక్కడ యేమి ప్రమాదం వచ్చిపడుతుందోనని. అందుకే ప్రయాణానికి తయారయేముందు, గ్రహస్థితి అదీ సరిగా చూసుకోందీ బయలుదేరను.

“మీ గ్రహస్థితి బాగుంటేమాత్రం రైల్లో ఇందరు ప్రయాణం చేస్తారుగదా, వాళ్ళందరి గ్రహచారం బాగుండక యేదైనా రైలు ప్రమాదం తటస్థిస్తే?”

“చాలాచక్కటిప్రశ్న వేశావమ్మా! కాని మొత్తంమీద రైలు సరిగా నడిచేదీ లేనిదీ లెక్కకట్టడానికికూడా సాధనాలు లేకపోలేదు. నాది పూచీ, రైలివాళ అట్టే లేటుకూడా కాకుండా ఇప్పటిలాగే చక్కగా ప్రయాణం చేసితీరుతుందని. అయినా యీ యెండ మరీ తీవ్రంగావుంది. ఇక్కడ ఇంత విశాలంగా కూర్చున్నాం; పంకాలు రివ్వున తిరుగుతున్నాయి - అయినా మనకే యింత బాధగా వుంటూంటే, పదిమంది కూర్చొనవలసినపెట్టెలో యాభైమంది యిరుక్కున్న థర్డుక్లాసు ప్రయాణీకుల సంగతి యెలా వుంటుందో?”

లీలకు థర్డుక్లాసుకీ సెకండ్ క్లాసుకీ వుండే సదుపాయాల తారతమ్యాన్ని చర్చించడానికి కుతూహలం లేకపోయింది. సాధ్యమైనంతత్వరలో తనచేతిని చూపించుకొని భవిష్యత్తును లీలగానయినా తెలుసుకోవాలనే తహతహ ఎక్కువయిపోయింది.

“బాబుగారు ఎంతవరకు ప్రయాణంచేస్తున్నారో చెప్పారుకాదు.”

“నేనా? నేను.” అంటూ ఉండగా దగ్గ వచ్చింది... చేతిలోని చుట్టపారేసి కొంతసేపు దగ్గి, కిటికీలోనుండి వంగి ఉమ్మి, మొగం తుడుచుకొని, “నేను బరంపురం దాకావస్తాను. అంటే, ఇంకా ఎక్కడ ఏరాత్రి పదిగంటలో అవుతుంది. అంచేత మనం తీరికగా చేతులు చూసుకోవచ్చును. ఈలోగా ఒక్కక్షణం, అంటే ఒక్క అరగంట కాస్త కన్నుమూస్తాను. ఎక్కడ, సుమారు పదిహేనేళ్లుగా అవిచ్ఛిన్నంగా సాగిపోతున్న అలవాటు, మధ్యాహ్నం భోజనానంతరం ఒక్క అరగంట కన్ను మూయడం. తరవాత మరి రాత్రి పడుకొందువరకూ బాధలేదు.” అని ఆమె సమాధానంకోసం ఎదురుచూడకుండా, చేతి సంచీని ఒక మూలగా తోసి తలక్రిందపెట్టుకొని, పడుకొన్నాడు.

ఒక్కక్షణం పడుకొని, ఏమి అనుమానం వచ్చిందో, అలాపడుకొనే, చొక్కా గుండీలు తీసి, లోపలిజేబులోనున్న పర్సు తీసి అందులోని నోట్లను జాగ్రత్తగా లెక్కపెట్టుకొని, పర్సులోవుంచి పర్సుభద్రంగా జేబులో పెట్టుకొని దానికొక పిన్ను పెట్టి, చొక్కా గుండీలు పెట్టుకొని కిటికీవంక తిరిగి నిద్రపోయేప్రయత్నం సాగించాడు.

అయితే పట్టిప్రయత్నించడం మాత్రమే అయింది. ప్రతికొద్దినిమిషాలకీ అటూ ఇటూ తిరుగుతున్నాడు. ఎంత గాఢమయిన అలవాటయినా పరిసరాలు మారేసరికి యథాప్రకారంగా సాగకుండా ఉంది.

ఒకమారు లీలతో అన్నాడుకూడా. “చూడమ్మా ఇందాకా కూర్చుంటే అంత నిద్ర ముంచుకొని వచ్చినట్టయిందా, తీరా పడుకొందామనేసరికల్లా నిద్ర రావడం లేదు. ఏమయినా సరే, సామర్లకోట వచ్చే పర్యంతం నా ప్రయత్నం నేను చెయ్యడం మానను. గీతలో శ్రీకృష్ణభగవానుడేమన్నాడు, “నీ ప్రయత్నం నువ్వు చెయ్యి, ఫలితం ఏమయినా సరే” అని కదా.

లీల తాను చదువుతూన్న పుస్తకం వంకనుండి ఒక్కమారు మొగం తిప్పి, మందహాసంతో సన్యాసిరాజుగారివంక చూసి, మళ్ళీ పుస్తకపఠనంలో నిమగ్నురాలయింది.

ఈమారు అట్టే ప్రయత్నం లేకుండానే నిద్రపట్టిపోయింది సన్యాసిరాజుగారికి. కొద్ది సేపటిలోనే గురకపెట్టి నిద్రపోసాగారు.

లీలకి తను చదువుతున్న నవల ఏమీ బాగుండకపోయినా అంతకంటె మరేం చేసేదిలేక అలా చదువుతూంది.

విపరీతంగా కాల్చడంవల్ల సిగరెట్లు రుచి లేకపోడం అటుండగా పెదవులు మండుతూన్నా, కామేశ్వరరావు చేసేపని మరేదీ లేక వరసగా సిగరెట్లు కాలుస్తున్నాడు.

సిగరెట్లు కాల్చడమన్నది ఆలోచన లేకుండా సాగిపోయే పని; ఆలోచన వేరే మార్గాన సాగిపోతూంది.

అలానే లీలకూడా పుస్తకంలోని అక్షరాలను చూస్తున్నది; పేజీలు తిరిగిపోతున్నాయి, కాని ఆమె మనసుకూడా ఏవో ఆలోచనలను నెమరు వేస్తున్నది.

ఇక, బండిలోని మూడవ ప్రయాణీకుడు సన్యాసిరాజుగారు; ఆయన బండిలోని పంకాల హోరును మించి గుర్రుపెడుతున్నారు, ఆయన మనసు ఏం చేస్తున్నదో గుర్తించడం కష్టం.

కామేశ్వరరావుకి కాల్చగా కాల్చగా సిగరెట్లమీద కోపం వచ్చిందో, లేక తన ఆలోచన ఒక నిశ్చయానికి వచ్చిందోగాని, కాలుస్తున్న సిగరెట్టు సగం పైగా ఉండగానే కిటికీలోనుండి పారేసి, బండిలోని ఆ పరిమితస్థలంలోనే అటూ ఇటూ పచారు చేయసాగాడు.

లీలకి తాను చదువుతున్న పుస్తకంమీద విసుగుపుట్టింది కాబోలు, పుస్తకం ముడిచి బల్లమీద పడేసి, తలగడసర్దుకుని చేరగిలబడింది, నిద్రపోయే ప్రయత్నంలో—

సన్యాసిరాజుగారి గుర్రు ఒక్కమారు ఆగడంతో బ్రహ్మాండమైన రొదచేసే ఫేక్టరీ ఏదో ఆగిపోయినట్టయింది. ఆయన ఇంకా బాగా నిద్రపట్టాలని కాబోలు పల్చని ఉత్తరీయాన్ని మొగంమీద వేసుకొని మరీ పడుకొన్నారు. మళ్లీ కొంచెంసేపటిలోనే యథాపూర్వంగా గుర్రు వినిపించసాగింది.

లీల కన్నుమూసుకొంటూంది, తెరుస్తూంది; ఆమెకు నిద్రపట్టేపావకాశం మళ్ళీ పుస్తకం పట్టుకుంటేనేగాని లభించదేమో ననిపించి పుస్తకంతీసి, టప్పునతెరిచి ఎక్కడవస్తే అక్కడనుండే చదవడం మొదలుపెట్టింది. అనుకొన్నప్రకారం చదవడం మొదలుపెట్టడంతో కళ్లు బరువెక్కసాగాయి.

పాపం, కామేశ్వరరావు, ఎంతకని పచారుచేస్తాడు! తిరిగితిరిగి, ద్వారందగ్గరకువెళ్లి బైటికిచూస్తూ ఉండేవాడు, నిలబడి ఆలోచిస్తూ ఉండేవాడు; అప్పుడప్పుడు సన్యాసిరాజుగారివంక తేరిపారి చూస్తూ ఉండేవాడు. చిట్టచివరికి ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా లీలదగ్గరికివెళ్ళి కళ్ళతోనే ఏమో మాట్లాడాడు.

అతని ఈధ్వనిలేని కంటిభాషతో లీల నిద్దరమత్తంతా ఎగిరిపోయింది - ఆమె తన కంతమాత్రం ఇష్టంలేదని వారించింది చూపులతోనే - అతను, ఇంతమాత్రానికి నీకెందుకుభయం అన్నట్టు ప్రశ్నించాడు - ఆమె ససేమిరా వల్లకాదంది. లేచి కూర్చొని, మళ్లీ పుస్తకం చదవడం మొదలు పెట్టింది. కామేశ్వరరావుకి ఆమె అయిష్టత ఒక పెద్ద అడ్డంకి కాకపోయినా తనికి తగిన ధైర్యంచాలక, మళ్లీ ఎప్పటిచోట బెర్తు మీద కూలబడ్డాడు. ఇందాకటికంటె జోరుగా సిగరెట్టుతీసి ముట్టించాడు.

లీల ఏమో సమాధానం చెప్పబోయి నట్లుగా అతని వంకచూసింది. అతనికి ఆమెను అర్థంచేసుకోవలసిన అవసరం కనిపించలేదు. పక్కకు తిరిగి తన సిగరెట్టు పొగలో తన్మయుడయాడు—

సామర్లకోటస్టేషను వస్తుండగా సన్యాసి

రాజుగారు లేచి, లీలను కుశలప్రశ్న చేశారు.

"అప్పటినుండి అలా కూర్చున్నారన్నమాట? కుర్రవాళ్లు గనక మీకా శక్తి ఉంది. గాని మాలాటి పెద్దవాళ్లకు మధ్యాహ్నం ఒక్క క్షణం కునుకుతీస్తే గాని, ఏమీ తోచదు. ఇందాకా నీతో ఏమిటో మాట్లాడుతున్నాను గాని, ఏమి మాట్లాడుతున్నానో నాకే తెలియదు. ఇక నుంచీ, మరి ఎంతరాత్రివరకయినా బాధ లేదు అని సంచిలోని తువ్వాలు తీసుకొని బాత్ రూములోనికి వెళ్ళేరు. మొగం కడుక్కొని వచ్చి తువ్వాలును ఆరబెట్టి, సరిగా కూర్చొని, ఉత్తరీయం మడతలు పెట్టి మెళ్లో వేసుకొనేసరికల్లా స్టేషనులో రైలాగింది.

"అమ్మాయి! ఇక్కడ స్టేషనులో మావాడొకడున్నాడు. వాడితో ఒక కబురు చెప్పవలసి ఉంది. కాకినాడలో ఒక పెద్ద ప్లీడరు గారికి ఒక సందేహం వచ్చింది. నన్ను వారి కుమార్తె జాతకం చూడమన్నారు – ఆ కబురు ఇక్కడ చెప్పేస్తే అందిపోతుంది. అంటే తిరుగుడలలో నే నెలాగూ కాకినాడ వెళ్ళవలసింది. మీకేమయినా కాఫీ టిఫిను మొదలయినవి కావలసిఉంటే..."

"మాకేమీ అక్కర్లేదు బాబూ! అయినా పెద్దవారు మిమ్మల్ని శ్రమ పెట్టడమా?"

"ఇంతమాత్రంలో శ్రమేం ఉందమ్మాయి! నేనలా అనుకోవలసినవాణ్ణి కాను. సరే, నా సంచీ చూస్తూ ఉండమని చెప్పనక్కర్లేదు - ఇందులోకి బహుశః ఎవరూ ఎక్కరు. ఎక్కినా తగు మనుషులేగాని మరొకరు కాదు - నేను కాఫీ ఫలహారమూ తెస్తానమ్మాయి, మీ యిద్దరికీ" అంటూ సంచిలోని థెర్మాసుఫ్లాస్కును పట్టుకొని దిగి వెళ్ళిపోయారు తిన్నగా స్టేషనుమాష్టరు ఆఫీసు వంకకు—

ఆయన అక్కడ పని తేమల్చుకొని, ఫలహారాల దుకాణంలో తాను ఫలహారం చేసి, బండిలోనివారికి ఫలహారాలు పొట్లాలు కట్టించి, కాఫీ ఫ్లాస్కులో పోయించుకొని వచ్చేసరికల్లా సరిగా బండి కదిలే వేళయింది.

బండిలో కామేశ్వరరావు లేడు.

లీల ఎప్పటిలా పుస్తకం పట్టుకొని కూర్చుంది.

సన్యాసిరాజుగారు లోపలికి వస్తూ "అబ్బాయి ఏడీ" అని ప్రశ్నించాడు.

లీల పరధ్యానంగా "వాళ్ళ స్నేహితుడు సుందర్రావు దగ్గర కెళ్ళేరు" అంది—

"సుందర్రావా? ఎవరు? అతనూ ఈ బండిలో వస్తున్నాడా? అలా అయితే ఫలహారం మరి కొంచెం పొట్లం కట్టించి ఉంటే వాట్లే, కాఫీ బాధ లేదు సరిపోతుంది."

"వద్దన్నా మీరు తేవడం మాశేరకొరు– అయినా ఎందుకిన్ని పొట్లాలు."

"ఎన్నున్నాయమ్మా; అసలు నే నివి చాలవేమో ననుకుంటూ ఉంటే .... అరె, రైలు కూసింది, వీళ్ళింకా రాలేదేం చెప్మా? కదిలిపోతూంది."

"పోతే పోనీండి, వాళ్ళు ఆ కేడో బండిలో ఎక్కిపోతారు, వచ్చే స్టేషనులో ఇక్కడికి వస్తారు."

"వచ్చే స్టేషనులో వాకి అంతవరకు

అరవై సంవత్సరములపైనుంచి డాక్టర్లు పెర్టుసిన్ ఔషధమును సిఫార్సు చేయుచున్నారు. ఎందువలననగా అది దగ్గులకు, గొంతునొప్పికి, శ్వాసకోశ వ్యాధికి, ఉబ్బస మునకు, కోరింత దగ్గుకు ఉపశమనము ఇచ్చును. క్షేమముగా స్వస్థతనిచ్చును. తీసుకొనుటకు యింపితమైనది. పెర్టుసిన్ కొనుడు!

అందరు కెమిస్టుల వద్దను లభించును

ఏజెప్రా లిమిటెడ్, షాన్ లీచ్ టెన్‌స్టెయిన్, స్విస్ కస్టమ్ అండ్ ఎకనామిక్ టెర్రిటరీ వారితో చేసుకున్న ఒడంబడిక ప్రకారము, యిండియాలో

ఇన్‌ప్రా లిమిటెడ్, పోస్టు ఆఫీసు బాక్సు నెం. 1041, బొంబాయి-1

వారిచే తయారయినది.

ILY-9 TEL

★ హస్తసాముద్రికం ★

కాఫీకి బాధలేదుగాని, ఫలహారాలు చల్లారిపోతాయి. నేనసలు కొంచెం ముందు వచ్చి ఉండవలసింది."

"వాళ్ళేం తినరనా? మీ కెందుకంత విచారం బాబూ; మీరు మీ కబురేదో చెప్పేకారా?"

"అది చెప్పకేం చెప్పాను—కాని, కనిపించకపోతే బాధలేదుగాని, కనిపిస్తే ప్రతివాళ్లు ఏవేవో ప్రశ్నలడిగేవాళ్ళే - ఏమున్న గలం, ఎవరి ఆతృత వారిది. అందరినీ తప్పించుకొని, దుకాణానికి వెళ్లేసరికి ఆలస్యం అయింది.

"బాబుగారు! నా చెయ్యి చూస్తా నన్నారు?"

"అన్నాను, ఇప్పుడు మాత్రం కాదంటున్నానా? ఈ సన్యాసిరాజు ఒక్కమాట అన్నాడంటే ఎన్నటికీ మరిచిపోడమ్మాయి! అయితే ఒక్క షరతు; నువ్వు చెప్పినట్టు వాళ్ళిద్దరూ ఫలహారం చేసివుంటారు. పాపం నువ్వు అలా కూర్చుంటే లాభం లేదు. కాస్త టిఫిన్ తిని, కాఫీ తాగివస్తే అప్పుడు తీరికగా కూర్చుందాము. మళ్ళీ వాళ్లొచ్చేదాకా నేను కదలను - నీకు ఫలితాలు అన్నీ కరతలామలకం అయ్యేట్టు చేస్తాను - మరి నీదే ఆలస్యం ఈలోగా నేను మరొక్క చుట్ట కాల్చుకుంటాను.

"మీరు మరేమీ తినరూ? నాకు ఒక్కర్తెకూ తినడం అదోకలాగుంటుంది బాబూ!

"నేనిప్పుడు మరేమీ తినలేను- అయినా మావయసులో ఒకరుతింటే చూసి ఆనందించడమేతప్ప, స్వయంగా అట్టే తింటే పడదు. నువ్వంతగా కాదంటే కాఫీ అక్కడ తాగినా మళ్ళీ తాగుతాను. నీదగ్గర ఏదయినా గ్లాసుందా?"

"ఉందిబాబూ", అంటూ తన సామానులోనుండి, ఒక పెద్దగ్లాసు తీసి, దానినిండా ఫ్లాస్కులోని కాఫీపోసి ఇచ్చింది."

అతను కాఫీతాగడం పూర్తి అయేలోగా ఆమె ఎలాగూ తప్పదని, ఒక లడ్డూ, రెండు గారెలు తింది. అతను ఖాళీచేసిన గ్లాసును కడుక్కొని అంగులో కొంచెం కాఫీపోసుకుని తొందరతొందరగా తాగింది. అతను అంత కొంచెం కాఫీ తాగడమేమిటమ్మాయి, అని బలవంతంగా మరికొంత కాఫీ గ్లాసులో పోసి, ఆమె చేత తాగించాడు.

తువ్వాలుతో చెయ్యి తుడుచుకొని, డబ్బాలోని వక్కపొడి కొంచెంతీసి నోట్లో వేసుకొని సన్యాసిరాజుగారికి ఇవ్వడమా మానడమా అని సందేహంలో పడింది అంతలో ఆయనే అడిగి తీసుకున్నాడు. ఆయన వార్ధక్యంకబుర్లలో నేతిప్ప పళ్లలో లేనట్టుంది. పటపటమని నమలసాగాడు. వక్కపొడిని.

ఆయన తనంతట తాను పిలిచేవరకు ఎదురుచూసే ఓపిక పట్టలేక, లీల తానే వెళ్లి ఆయన దగ్గరగా కూర్చుంది చేయి ముందుకు చాపి. సన్యాసి రాజు గారు చొక్కావక్క జేబులోంచి ఒక భూతద్దాన్ని తీసి ఉత్తరీయంతో తుడిచి చేతిని పరిశీలించసాగాడు.

కొంతసేపు భూతద్దంతో చేతిలోని రేఖలనూ వాటినీ, పరిశీలించేవాడు; తరువాత కొంతసేపు వేళ్ల పొట్టి పొడుగులను, అరచేతి నున్నదనాన్ని ఎత్తు పల్లాలనీ శ్రద్ధగా గమనించేవాడు; చేతిని గోళ్ళనూ ఊరికినే కొంతసేపు చూడడం, భూతద్దంతో కొంత సేపు చూడడం.

లీల అతని మొగంలోని కదలికలను అతి శ్రద్ధగా గమనించేది. అతను సంతోషిస్తున్నాడో, విచారిస్తున్నాడో తన భవిష్యత్తునుగూర్చి ఏమి భావిస్తున్నాడో, భూతంలా తన్ను పట్టుకొని వదలకుండా ఉన్న భూతంగురించి అంతా అతనికి తెలిసిపోయిందేమో? ఏమీ చెప్పకుండా ఉన్నాడు.

లీల మరి కుతూహలాన్ని అణచుకోలేకపోయింది. "ఏమిటి బాబుగారూ! ఏమీ చెప్పకుండా ఉన్నారు? అంత చెప్పడానికి వీల్లేనంతపాడుగా ఉన్నాయా రేఖలు?"

"చెప్పక ఎక్కడికి పోతాను? కాని, అసలు ఒకరు చెప్పవలసిన అవసరంలేదు; నీభవిష్యత్తు సంపూర్ణంగా నీచేతిలో, అంటే నువ్వెలా నడిపించదలచుకుంటే అలా నడుస్తుంది. చేతిలో రేఖలు అనేకం వుంటాయి; అవి ఇచ్చేఫలితాలుకూడా వేరు వేరుగానే ఉంటాయి. కాని, వాటన్నిటినీ తోసిరాజనే బ్రహ్మాస్త్రంవంటి రేఖవొకటి ఉంది; అది ఆత్మశక్తిని సూచిస్తోంది. అంటే నువ్వు పట్టుదలగా చేసితీరాలనుకొన్న పనిని చేసి తీరుతావు - ఏది కావాలనుకొంటే అది అయిపోయితీరుతావు."

"నాలో అంతశక్తి వుందంటారా? నేనన్నమ్మను. చిన్నతనంనుండి నేను ఎన్నో కావాలనుకొన్నాను. ఏమేమో చేయాలనుకొన్నాను. ఏదీ చెయ్యలేకపోయాను; అంటే నే ననుకొన్న ప్రకారంగా!

"కావచ్చునమ్మా! కాని; నామాట పూర్తిగా వినుమరి. నేను చూస్తున్న యీ రేఖ యిదివరలో నీచేతిలో లేకపోయి వుండవచ్చును. మన శరీరాలలాగే, మనస్సులలాగే రేఖలుకూడా మారుతూవుంటాయి. అదివరకున్న కొన్ని రేఖలు మాసిపోతూవుంటాయి; కొత్తవి పుడుతూ వుంటాయి. అంచేత వొకకాలంలో వొక వయస్సులో చేయలేని పనిని యింకొక సమయంలో సులభంగా చేయడం సాధ్యంకావచ్చును.

"ఏమో నేను చిన్నప్పటినుండి యిప్పటి వరకూ వొక్కలాగే ఉన్నట్టున్నాను. నాలో యే మార్పులూ వచ్చినట్టులేదు."

"నువ్వలా అంత సులభంగా కొట్టిపారేస్తే కాదు, నన్ను సాంతం చెప్పనీ - ఈ రేఖను నేను చాలా కొద్దిచేతుల్లో చూసేను - అది విపరీతమయిన పట్టుదలనీ, ఎటువంటి అవాంతరాలు వచ్చినా యెదుర్కొని తన పని సాధించుకోగలఆత్మశక్తినీ సూచిస్తోంది. ఈరేఖ, అంటే యిక్కడ కనిపిస్తున్న పెద్ద గీతకాదు, ఆ ప్రక్కకు లీలగా కనిపిస్తోంది. భూతద్దంలో బాగానే కనిపిస్తుందిలే, యిది నీచేతిలో ఈ మధ్యనే ఏర్పడివుండవచ్చును.

"మరి నన్ను చెప్పనీ! నీకు చిన్నతనం నుండీ వొకకోరిక ఉండేది. ఇంతకాలమూ అది తీరనికోరిక అయిపోతుందేమోనని భయపడుతూ వచ్చేవు అయితే నీకువచ్చిన అవకాశాలు బహుస్వల్పం; నువ్వు వాటినైనా సరిగా వినియోగించుకోలేదంటే మరి కోపం తెచ్చుకొని లాభంలేదు - కాని."

సన్యాసిరాజుగారు ఈ "కాని" అనే మాటను చాలా గంభీరంగా మేఘ గర్జనలాగ అని కొంచెంసేపు ఆగారు.

లీలకు అతనిలా ఆగిపోవడం యిష్టంలేకపోయింది. "చెప్పండిబాబూ: నేనే మీ అనుకోను; అయితే ఆకోరిక అలా అంతరించి పోవలసిందేనా?"

సన్యాసిరాజు "అది సరిగా ఏ మాట అలో చెప్పడమో ఆలోచిస్తున్నాను. గత ఆరు నెలల క్రితంవరకూ నీలోని అనుమానం భయం, చొరవలేనితనం నిన్ను వెనక్కి నెట్టేసేయి. ఇప్పుడు మరి నిన్ను నిలువరించి, మళ్ళీ వెనకటిదారిలో పెట్టడం బ్రహ్మతరంకాదు."

"ఏమిటో బాబూ! నాకు సరిగా అర్థం కావటంలేదు. కొంచం స్పష్టంగా చెప్పండి."

"స్పష్టంగా అంటే అమ్మాయి! చూడూ, ఈ రేఖలు కొన్నికొన్ని ప్రధానమైనసంఘటనలను సూచనగా మాత్రమే తెలియచేయగలవు. వాటిని మనం, మన పరిస్థితులనుబట్టి పరిసరాలనుబట్టి, సావకాశాలనుబట్టి, సమన్వయించుకోవాలి. ఇప్పుడు నువ్వనావంటే, చూడూ, నిన్నుగురించి నాకేమీ తెలియదు. తెలిసినవాళ్ళ సంగతైతే వాళ్ళ గత జీవితాలనుబట్టి, ఆశలనుబట్టి, ఆశయాలనుబట్టి, భవిష్యత్తునుగూర్చి, వాళ్ళకు కావలసిన పద్ధతిని స్పష్టంగా చెప్పవచ్చు.

అయినా, నీ గురించి, నేను కొంత చెప్తాను. దాన్ని నువ్వు నీ పరిస్థితులకు అన్వయించుకొని అర్థంచేసుకోవాలి. ఇదివరకల్లా నీవు ఎదురుచూస్తూవచ్చిన సావకాశానికి, ఈ ప్రయాణానికి, ఏదో సన్నిహితసంబంధం ఉంది. గత నెలలో కాక రెండుమూడు నెలలైనా కావచ్చును, నీ జీవితంలో ఒక ప్రధానమైన సంఘటన జరిగింది."

"అంతవరకూ రైటే బాబూ! కాని నా కోరిక..."

"అదీ నన్ను చెప్పనీ; నీ వేళ్లను చేతిలోని రేఖలను చూసీచూడ్డంతో ఎంత సాముద్రికం, చేతకానివాడయినా నీలో కళాభిరుచి ఉందన్న సంగతిని సులభంగా చెప్పేయగలడు. అయితే కళల్లోనూ కవిత్వము, చిత్రలేఖనముకంటే నృత్యగానాలకే సంబంధించిన అభిరుచి ఎక్కువ అనవచ్చు."

"వట్టి అభిరుచేనాబాబూ! అది ఏమైనా ఫలిస్తుందా లేదా?"

"నేను ఇప్పుడు చేతిలోఉన్న పరిస్థితిని గూర్చి చెప్పగలనుగాని భవిష్యత్తు అంతటినీ నిశ్చయంగా ఎలా చెప్పడం? ఇప్పటి ధోరణినిబట్టిచూస్తే అంతా బాగానేఉంది అందులోనూ నీ ఆత్మశక్తి, పట్టుదల, ఇవి నిన్ను కాపాడాలి. ఇందాకా, నన్ను పూర్తిగా చెప్పనిచ్చేవు కావు. నృత్య సంగీతాలకంటె కూడా, నటనఅంటే నీకు మహాఇష్టం, అదే నీ తపస్సు. అందుకోసం, ఎంతటి త్యాగాన్ని చేయడానికైనా సిద్ధంగా ఉన్నావు."

"అంతవరకు అంతా సరిపోయింది బాబూ. కానీ ....."

"నాకు తెలుసునమ్మా నిన్ను కొన్ని దుష్టగ్రహాలు పట్టుకొని పీడిస్తున్నాయి, అవి నీ ఆశయసిద్ధికి అడ్డు తగుల్తాయేమో నని, వాటిని వదిలించుకోడం, ఎలాగా అని భయపడుతున్నావు కాని అటువంటిభయం, ఏమీ అక్కర్లేదు. వాటిబాధ త్వరలోనే వదిలిపోతుంది"

"నిజంగానా? బాబూ! నిజమే?"

"నిజమేనమ్మాయి! కాని నీ చేతిని ఉంగరంలో ఈ నీలపురాయి ఉండడం, గ్రహావీక్షణదృష్ట్యా ఏమీ మంచిదికాదు. నీకు తగింది, మంచి ఆకుపచ్చటిరాయి. అంటే కేవలం అందంగురించి చెప్తున్నాననుకోకు. ఏదో చవకరకం, గాజురాయి కాక, అసలు పచ్చతాపినఉంగరం, నీ వేలిని ఉంటే, అప్పుడు, కళాభివృద్ధికి కారణమైన, శుక్రుడిప్రభావం, వలన ఇంతవరకు నువ్వు అందనిపండు అనుకుంటున్న అవకాశం దానంతటనే నీ చేతికి వస్తుంది. ఇటువంటిమాటలు నమ్మకం లేనివాళ్ళకు చెప్తే వట్టి చాదస్తం అనుకుంటారు. వేలినున్న రాయికి, అదృష్టానికి ఏమిటిసంబంధం? అనుకుంటారు. నీకు నమ్మకం, ఉన్నా లేకపోయినా నామాట పోదా చూడ్డానికయినా అసలైనపచ్చ ఉన్న ఉంగరాన్ని కొన్నాళ్లు పెట్టుకొనిచూడు. అప్పుడు నీకే బోధపడుతుంది అదేమంత పెద్దఖరీదుకాదు కూడా. అయితే కళారంగంలో అభివృద్ధిని కోరేనువ్వు, పూర్తిగా పచ్చలుతాపిన హారమే ధరించగలిగితే అదృష్టం నిన్ను మూడురోజులలో పైకెత్తేస్తుంది. కానీ పూర్తిగా పచ్చలుతాపిన హారం, అంటే సామాన్యం కాదు. ఏవో మాయరాళ్లు పెట్టిన హారం, కంటె అసలైన నిసలైన ఒకేఒక రాయి ఉన్న ఉంగరాన్ని పెటుకోడమే నయం నీకు నా ఎడ్రుస్సు రాసి ఇస్తాను ఆరు నెలల్లో నీకు తగిన ఫలితం, కనిపించిందో లేదో రాద్దువుగాని"

అతను చెప్పడం ఆపి, ఉత్తరీయంతో మొగం తుడుచుకోసాగేడు.

అతని ఈ ప్రసంగం వింటూఉంటే లీలకు మొదట కొంచెం, గాభరా కలిగింది. కాని చివరంటా వినేసరికి ధైర్యము సంతోషం మాత్రమే కలిగేయి. కొంచెం సేపు తనలో తను గుంజాటనపడి, ఏదో నిశ్చయం చేసుకొన్నట్టుగా లేచి, బాత్రూములోనికి వెళ్లి ఒక్క నిముషంలో బయటకు వచ్చింది ఆమె చేతిలో ధగధగ మెరుస్తున్న పచ్చలహారం ఉంది. సన్యాసిరాజుగారు, దాన్ని గమనించినట్టేలేదు. చుట్టలు చుట్టలుగా పైకిలేస్తున్న తన చుట్ట పొగనే, తదేకదీక్షగా చూస్తున్నారు, ఆమె అడిగింది:

"బాబూ! ఇది చూడండి. ఈ రాళ్లు మంచివే ననుకుంటాను. ఇది మా అమ్మమ్మ తల్లి కాలంనుండి ఒకరి తరువాత ఒకరికి చెందుతూ వచ్చింది. రాళ్ళు బాగానే ఉన్నా, హారం, పటాటోపంగా ఉండటం వల్ల, నాకు వేసుకుందికి అంత మనస్కరించటం లేదు. కాని మీరు చూసి ఈ రాళ్ళు మంచివంటే వీటితో ఇంకొక హారం, చేయించుకుంటాను."

సన్యాసిరాజుగారు, హారాన్ని చేతిలోనికి తీసుకొని, భూతద్దంతో పరీక్షగా చూస్తూ అన్నాడు:

"ఇందాకా నీ ఉంగరానికి పనికి వస్తుందని చెప్పేనే, అందుకు ఇందులోని ఒక్కొక్క రాయే చాలును. ఇంక, హారం సంగతి చెప్పాలా. అయితే నువ్వు దాన్ని మార్పుచేయించడం నాకు అంత ఇష్టంలేదు. నువ్వు ఈ హారాన్ని ధరించడం, ఆరంభించిన, నెల్లాళ్ళలో నీ అదృష్టం, పూర్తిగా తిరిగిపోకపోతే అప్పుడు నన్ను అడుగు." అంటూ మళ్ళీ ఆహారాన్ని పరిశీలించడం సాగించేడు.



★ హస్తసాముద్రికం ★

అనకాపల్లి స్టేషను దగ్గరపడుతూంది. పోర్షాన్ని ఆమె చేతికి ఇచ్చి, ఫ్లాస్కులోని కాఫీ తానే పోసుకొని చప్పరించసాగేడు. ఈలోగా లీల మరోకమారు బాత్ రూమ్ లోకి వెళ్ళివచ్చింది. ఇంకా ఏమో ఆమెకు అతన్ని అడగాలనే ఉంది.

"బాబూ! ఆ మధ్యను ఎవరో చెప్పేరు. నాకు ఈ సంవత్సరంలో ఏదో ప్రమాదం, రానున్నదని దాని మాట..."

"చెప్పడాని కేంలే, ఏవేవో చెప్తూ ఉంటారు - చెప్పినవన్నీ నమ్మకూడదు. కొందరు ఏవేవో చెప్పి భయపెట్టి శాంతుల కని, గ్రహజపాలకని డబ్బు లాగేస్తారు. మన పద్ధతి అదికాదు. చెప్పదలచినదేదో ఖచ్చితంగా చెప్పేస్తాం."

"అయితే బాబూ! మరి నా కిప్పట్లో మరేం ప్రమాదం లేదంటారా?"

"నేనటువంటి దృష్టితోనే చూడలేదు. అయినా నీ వింతగా అంటున్నావు కాబట్టి మళ్ళీ జాగ్రత్తగా చూస్తాను. అనకాపల్లి స్టేషను వచ్చేస్తుంది. స్టేషను దాటిపోనీ మళ్ళీ చూసుకుందాం."

చేతిని ముందుకు చాపి రైలు కదిలేవేళ వరకు అతి ఆతృతగా ఎదురుచూస్తూ కూర్చుంది లీల. రైలు కదిలిందికాని, మరి ఆమె చేయి చూసే భాగ్యం, కలగనేలేదు సన్యాసిరాజు గారికి.

రైలు కదిలిన తరువాత పరిగెడుతుంటూ అందుకొని ఎక్కేరు, ముంగుగా కామేశ్వరరావు తరువాత అతని స్నేహితుడు సుందరరావున్నూ. వాళ్ళు బండిలోపలికి వచ్చి కొంచెంసేపు ఏమీ మాట్లాడకుండా తలుపు దగ్గరే నిలబడి ఉన్నారు. రైలు స్టేషను ప్రాంతాలను దాటిపోయింది. ఇక ప్రారంభ మయింది రభస.

కామేశ్వరరావు, సుందరరావు, తమ కోర్టును బాగానే గుర్తుపెట్టుకున్నట్లు ఉన్నారు - తన భార్య ఇంకొకడితో వ్యభిచరించగా ఆగ్రహోదగ్రుడైన భర్తలా కామేశ్వరరావు జరిగిందేదో జరిగి పోయిందిలే ఇప్పుడు శాంతించమనే మధ్య వర్తినిగా సుందరరావు.

లీల కిదేమీ అర్థం కాలేదు. ఆమె ఏదో మాట్లాడబోయింది. కామేశ్వరరావు ఆమెను మాట్లాడనీయకుండా నోరుమూసి, అవతలి బెర్తుమీదికి విసరి, "నోరు విప్పేవంటే చంపేస్తా" నన్నాడు. ఆమె మొగాన్ని చేతుల్లో కప్పుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"సన్యాసిరాజు గారు ఏమీ చలించలేదు. శాంతంగా "అబ్బాయిలూ ఎందుకలా ఆవేశ పడతారు. ఆ అమ్మాయి నా కూతురులాంటిది. ఏదో సరదాకొద్దీ అడిగితే చేయిచూసి ఫలితాలు చెప్తున్నాను." అని ఈ విషయంలో తను చెప్పవలసింది మరింకేమీ లేనట్లు, చుట్టతీసి నిదానంగా ముట్టించేడు. సుందరరావు, "అంటే పాణిగ్రహణం చేసేరన్న మాట. అవకాశం, వచ్చేవరకూ అందరూ సదాచారులే. అయినా పట్టపగలు; మట్టమధ్యాహ్నం; ఇంత ఘోరకలి ఉంటుందనుకోలేదు" అన్నాడు.

కామేశ్వరరావు మరీ విజృంభించేడు. సుందరరావేగాని అడ్డంగా ఉండకపోతే ఇద్దర్నీ అక్కడే హతమార్చి ఉందునని అన్నాడు. సుందరరావు అతన్ని శాంతి పరుస్తున్నట్లుగా "ఎందుకుభాయ్! మొదటే దండప్రయోగం. ఇతర పద్ధతులున్నాయి కదా అవన్నీ విఫలమైతే అప్పుడుచూదాం. ధర్మాన్ని కాపాడ్డానికి గవర్నమెంటువారు ఏర్పాటుచేసిన కోర్టులున్నాయి; పోలీసు సిబ్బందిఉంది. ఏ ప్లీడరుకో, ఒక్క ఏభై రూపాయిలు ఫీజుపారేస్తేసరి, నష్టపరిహారం, విషయం, విడాకుల విషయం, దానంతటదే తేలిపోతుంది"

ఈ మారు సన్యాసిరాజుగారు భయంతో వణకుతూ "బాబ్బాబు! ఆ అప్రతిష్ఠమాత్రం తేకండి. 'పరువుగలవాడికి, అపకీర్తి, చావు కంటే ఎక్కువ దన్నాడు' గీతలో శ్రీకృష్ణ భగవానుడు. అయినా దైవసాక్షిగా చెప్తున్నాను మరొకమారు ఆ అమ్మాయిని నేనేం బలవంతం చేయలేదుకదా? చేసిఉంటే ఆమే మీతో స్వయంగా చెప్పిఉండేది. ఇక నన్ను చూచి, వలచిపోయిందంటారా? ఈ వయస్సులో ఈ ఆకారంతోఉన్న నేను ఆమెకంటికి నవమన్మథుడులా కనిపించి ఉంటానా?"

కామేశ్వరరావు చెయ్యి చేసుకో బోయి నంత పనిచేసేడు. సుందరరావు అతన్ని బలవంతంగా కూర్చోబెట్టి, సన్యాసిరాజుగారి దగ్గరికివచ్చి కూర్చొని, పరిష్కారమార్గాన్ని చెను చేయసాగేడు.

అతను సూచించిన పరిష్కారమార్గానికి, సన్యాసిరాజుగారు అతి విచారంగా అంగీకరించక తప్పిందికాదు.

కామేశ్వరరావుకూడా తనకోపం, తగ్గక పోయినా అయిష్టంగాఉన్నా, కేవలం ఆత్మమిత్రుడు సుందరరావు చెప్పేడుకదా అని ఎలాగో అంగీకరించేడు.

ఫలితంగా సన్యాసిరాజుగారు, దొంగల పాలుగాకుండా చొక్కాలోపల బాడీ జేబులో అతి భద్రంగా దాచుకున్న మనీ పర్సునతీసి అందులోని పది, వందరూపాయల కాగితాలనుతీసి సుందరరావు చేతి కిచ్చేడు. అతను వాటిని తీసుకొని కామేశ్వరరావు చేతికిచ్చి మళ్ళీవచ్చి, సన్యాసిరాజుగారి పక్కనుకూర్చొని పరామర్శ ప్రారంభించేడు. "బాబూ! తమ ప్రయాణఖర్చులకు డబ్బు మిగిలిఉందా?"

సన్యాసిరాజుగారు నిస్పృహ చేసుకున్నట్లుగా "ఏదోబాబూ! నీ దయవల్ల కోర్టులంటతిరిగి అపకీర్తిపాలయేకర్మం, తప్పింది. నేను మొదటనుంచీ భయపడుతునే ఉన్నాను ఆ రాహు, కేతువులిద్దరూ నన్ను సులభంగా విడిచిపెట్టరని. ఇంతకాలం, గౌరవంగా బ్రతికి పెద్దవాళ్ళయిన, కొడుకులూ కూతుళ్లూ ఉండి, ఒకరైలు ప్రయాణంలో, నీచంగా, అవినీతికరంగా ప్రవర్తించినట్లు కోర్టులవెంట తిరిగి, సాక్ష్యాలు సంపన్నాలు సమకూర్చుకొనే ప్రారబ్ధం తప్పింది. అక్కడికి అంతే చాలును. అక్కడ బరంపురంలో పెళ్లివాళ్లకూ మాకూ చాలాకాలంగా స్నేహం, నిజానికి నేను వాళ్ళకి కొంత ఋణపడి ఉన్నాను. అందుకని పెళ్లిలో కట్నం చదివించాలని ఈడబ్బు పట్టుకున్నాను. మా కుర్రవాళ్లు ఇద్దరూ వచ్చారుకారు. వాళ్లు వచ్చిఉంటే, వాళ్ల చేతికి ఇచ్చి నేను ప్రయాణం, మానుకొని, ఉండేవాడిని, అయినా ఈ వెయ్యిరూపాయలతో వాళ్ళ ఋణంనుండి విముక్తుణ్ణి కావటం, భగవంతుడికి ఇష్టం లేదేమో. మరింక నేనక్కడికివెళ్లి, ఏం ప్రయోజనం? వాల్తేరులోదిగి ఇంటికి తిరిగిపోతాను. మా ఆవిడ చెప్పినట్లు ఏదో బంగారపు వస్తువు కొని, ఇన్‌ష్యూరుచేసి పంపించేస్తాను." అని ఉత్తరీయంతో మొగం తుడుచుకొని తల కిటికీవంకకు తిప్పుకొని, దిగులుగా కూర్చున్నారు. సుందరరావుకి ఆయనతో మరి మాట్లాడేపని లేకపోయింది. వెళ్లి కామేశ్వరరావు ప్రక్కన కూర్చున్నాడు. ఇద్దరూ ఖులాసాగా కళ్ళతోనే మాట్లాడుకోసాగారు. లీల వాళ్లవంకచూసి ఏదో మాట్లాడబోయింది. సుందరరావు ఆమెను వారించి "ఊరుకో లీలా! వాళ్లిద్దర్నీ ఒప్పించి పరిష్కారం కుదిర్చేసరికే తల ప్రాణం తోక్కివచ్చింది. ఇప్పుడు నీవేమైనా అంటే అంతా మళ్ళీ మొదటికి వస్తుంది. ఇంతకీ, మీ పొరపాటేమీ లేదే అనుకో, అయినా ఆయనకిలేని విచారం, నీకెందుకు? అయినా ఇందుకు మనంగాని ఆయనగాని కర్తలం కాముకదా, అంతా ఆ రాహుకేతువులు మనల నందర్నీ యిలా ఆడించిన ఫలితం", అంటూ వికటంగా నవ్వాడు. అతని ఈమాటకి కామేశ్వరరావు మొగం చేటంతయింది. లీలకు

మాత్రం, యిదేం నచ్చలేదు కాని చేసే దేమీ లేక, తల కిటికీ వంకకు త్రిప్పుకొని కూర్చుంది

వాల్తేరు స్టేషను సమీపిస్తూవుండగా సుందరరావు మళ్ళీ సన్యాసిరాజుగారి వద్దకు చేరి అతన్ని ఓదార్చ సాగేడు సన్యాసిరాజుగారు అంత నిరుత్సాహపడినట్లు లేరు "ఏం చేస్తాం? నాయనా!, అంతా గ్రహచారం, భగవద్విలాసం, నాయనా!" అని తమ సంచీని మరికొంచెం దగ్గరగా తీసుకొని కూర్చున్నారు

స్టేషనుయార్డునుదాటి రైలు ప్లాట్ ఫారం సమీపిస్తున్నది సన్యాసిరాజుగారు లేచి, తలుపునకు వీపు ఆనించి నిలబడి అన్నాడు ఈమారు ఆయన గొంతు అదివరకటిలాగే కాక ఖంగుమని మ్రోగింది

"మీకు తెలియదుగాని మనం, తరుచు కలుస్తూవుండవలసిన వాళ్ళమే ఇంత సేపూ మీవంతు అయింది ఇకను నేనూ ఒకచిన్న గమ్మతు చేస్తాను" అతను యీ మాటలు అంటూవుండగా ముగ్గురూ వాళ్ళంతా కళ్లు చేసుకొని అతనివేపు చూడసాగారు

సన్యాసిరాజుగారు "ఇదేం అవసరం లేదు కానీ, మీలాగే, నాకూ నాటకం అంటే సరదా అంచేత" - అని సంచీలో నుండి చుట్టలడొక్కు తీసినంత సహజంగా రివాల్వరుతీసి పట్టుకొని "హేండ్సు అప్! కదలకండి స్టేషనుకూడా వచ్చేసింది అని కొంచెం నవ్వుతూ "చెప్పేను కదూ, ఇది వట్టి అనవసరమైన నాటకమని నా మానాన నేను మాట్లాడకుండా దిగిపోయినా చాలును కానీ రివాల్వరును బైటికి తీయకుండావుండడానికి మనస్కరించలేదు" అని వెనకనించే తలుపు తెరచి క్రిందింట ప్లాటుఫారం వంక చూసి "అరుగో మీ స్నేహితులు, సామర్లకోటలో యిచ్చిన వైరు, వృథాపోలేదు" అన్నాడు

కామేశ్వర్రావు ఆఖరిప్రయత్నం చేయబోయేడు, సన్యాసిరాజుగార్ని, తోసుకొని తప్పించుకు పారిపోవాలని, కాని, సన్యాసిరాజుగారి ఎడంచేతిపోటు అతన్ని వెనక్కి తూలిపడేలా చేసింది సన్యాసిరాజుగారు దిగి క్రిందనున్న పోలీసు ఇనస్పెక్టరుతో హారం, ఆమె దగ్గరే ఉంది అయితే ఇందులో నా మదుపుకూడా వెయ్యి రూపాయలు ఉంది సుమండి"—

ముగ్గుర్నీ బంధించి రైల్వే పోలీసు స్టేషనుకు తీసుకొని వెళ్ళిపోయేరు

పోలీసు ఇనస్పెక్టరు సన్యాసిరాజుగార్ని స్తోత్రపాఠాలతో ఉక్కిరిబిక్కిరి చేయసాగేడు సన్యాసిరాజుగారు, చాలా సామాన్యంగా "నీకు చెప్పలేదటయ్యా! నీకు ఆరునెలల్లో ప్రొమోషను వస్తుందని, ఈ దెబ్బతో తప్పకుండా వస్తుందిలే" అన్నాడు

పోలీసు ఇనస్పెక్టరు, "ఇందులో మాదేముంది లెండి అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, మీరు ముగురిని మా చేతిలోకి అప్పజెప్పేరు అయితే మీరు సామర్లకోటలోనే ఎందుకు వాళ్ళను పట్టుకోలేదు?"

"అదా! అప్పటికింకా హారం, సంగతి ఏమీ తేలందే, నాదగ్గర పర్సులో ఉన్న డబ్బును చూసి, వాళ్ళకు ఒక నాటకం, ఆడాలని బుద్ధిపుట్టింది, నాకూ అది మంచిదే అయింది. సాముద్రిక ప్రస్తావనలో హారం సంగతి స్పష్టంగా తెచ్చి, కళ్లతో చూడ్డానికి వీలైంది లేకపోయినా విలువైన రాళ్లనీ గురించిన ప్రస్తావన తెచ్చి వాళ్ళ ముఖ కవళికలనుబట్టి వాళ్ళదగ్గర ఉందో లేదో కనిపెట్టిఉండేవాడిని అయితే అంత అవసరం, లేకపోయింది పాపం, ఆ అమ్మాయికి వాళ్లు ఆడే నాటకం అర్థం కాలేదు, నే నాడే నాటకం, వాళ్లకి బోధపడలేదు వాళ్లదగ్గర పెద్ద హారం, అయితే ఉంది కాని, పై ఖర్చులకి అట్టే డబ్బులేదని నాకు తెలుసును అంచేత నాదగ్గర డబ్బు ఉన్నదంటే వాళ్లు మన మనుష్యులే అయితే తప్పక కక్కుర్తిపడి తీరాలి" అంతా అనుకున్నట్టే జరిగింది

సరదాకి నేర్చుకున్న హస్తసాముద్రికం, ఈనాటికి ఈ విధంగాకూడా వినియోగించింది అయితే ఆ అమ్మాయికి ఏదో పెద్ద సినీమాస్టారు నయిపోదామన్న కోరికే తప్ప జరిగిన ఖూనీతో అట్టే సంబంధం లేదు అయితే కొంతవరకు వీళ్లతో లాలూచీ పడకపోలేదు అయితే వీళ్ళు ఘటికులే ఒకవేళ పట్టుబడినా, వస్తువు ఆమె దగ్గర ఉంటుంది కనక తాము తప్పుకోవచ్చు ననుకున్నారు ఏమైనా ఆ అమ్మాయికి అట్టే కఠినమైన శిక్ష పడేలా నేరం మోపకండి, నిజంగానే ఆమె చేతిలో మంచి భవిష్యత్తునే సూచించే రేఖలున్నాయి ఈ శిక్ష ఏదో అయి, బయటపడి బాగుపడుతుందేమో? అప్పుడు వెళ్ళి అడిగి నా హస్తసాముద్రిక ఫలితానికి ఫీజు పుచ్చుకుంటాను ★

తెలుగుజిల్లాలకు, నైజాముకు ఏజంట్లు:
శ్రీ సీతారాం జనరల్ స్టోర్సు.
బెజవాడ, సికింద్రాబాదు

బొల్లి (తెల్ల మచ్చలు)
సమస్త చర్మవ్యాధులకు పురాతన చికిత్స
క్యాటలాగు, సలహా ఉచితం
జి. వి. రెడ్డి & కో., (రిజిష్టర్డు)
"భాస్కరాశ్రమం"
గోపాలపురం, తూర్పుగోదావరిజిల్లా

విచిత్ర వ్యక్తి
మూలం: మార్క్ ట్వేన్
అనువాదం నండూరి రామమోహనరావు
వెల రూ. 1-8-0
పోస్టు ఖర్చులు ప్రత్యేకం
ఆంధ్ర గ్రంథమాల, ★ మద్రాసు-1